

ఉత్సవం..ఉత్సాహం

కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాలు అంబరాన్నంటుతున్నాయి. రెండో రోజూ జాతరకు లక్షలాది మంది భక్తులు హాజరయ్యారు. - 8లో



సరదా లేని దసరా

పండగ వేళ కూరగాయల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న రేట్లతో సామాన్యులు కుదేలవుతున్నారు. - 8లో

వాహనాలు స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరు చిన్నరుప్పపేటలో సముద్ర తీరంలో ఇసుక దిబ్బలను అక్రమంగా తరలించేందుకు ఉపయోగిస్తున్న ట్రాక్టర్, జేసీబీలను ఎచ్చెర్ల పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అజ్ఞాత వ్యక్తుల ఫిర్యాదు మేరకు వాహనాలను స్టేషన్‌కు తీసుకొచ్చి డ్రైవర్లును అరెస్టు చేశారు. అనంతరం స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు.

న్యూస్‌రీల్

మహిళా రోగులకు ఉచిత చికిత్సలు

శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో మహిళా రోగులకు ఉచిత క్యాన్సర్ చికిత్సలను గురువారం నిర్వహించనున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్‌ను రొమ్ముక్యాన్సర్ అవగాహన మాసంగా, స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్ పేరిట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకూ వైద్య సేవలందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 6309990630, 7680945332 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అనాథలకు అన్ లిమిటెడ్ ఫుడ్



కాశీబుగ్గలోని ఓ హోటల్లో భోజనం చేస్తున్న అనాథ చిన్నారులు

కాశీబుగ్గ: తల్లిదండ్రులతో కలిసి హోటల్‌కు వెళ్లి భోజనం చేయడం.. తర్వాత షాపింగ్ చేయడం .. ఆనందంగా గడపడం.. ఇవన్నీ అనాథలకు అందని ద్రాక్షే. ఆ కలనే నిజం చేసేందుకు ఓ ఎన్ఆర్ఐ ముందుకొచ్చారు. పలాస మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బమ్మిడి కిషోర్ అనాథలకు ఆనందం కలిగించేందుకు చొరవ తీసుకున్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రభుత్వం నడుపుతున్న బాలసదనంలో 30 మంది అనాథల పిల్లలను హోటల్‌కు తీసుకెళ్లి కోరుకున్న భోజనం పెట్టారు. ఐస్ క్రీమ్‌లు, స్నాక్స్.. ఇలా ఒకటేమిటి వారు ఏది అడిగితే అది కొనిపెట్టారు. అనంతరం ఓ పెద్ద షాపింగ్ మాల్‌కు తీసుకెళ్లి నూతన వస్త్రాలు కొనుగోలు చేశారు. దీంతో చిన్నారుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి.

సాక్షికంగా కిరణ దర్శనం



మూలవిరాట్టును తాకిన సూర్యకిరణ కాంతులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి మూలవిరాట్టును రెండో రోజు బుధవారం కూడా సూర్యకిరణాలు తాకాయి. అయితే ఆకాశం మేఘావృతం కావడంతో ఉదయం 6.12 నిమిషాల సమయంలో ఓ మూడు నిమిషాల పాటు మాత్రమే సాక్షికంగా తాకినట్లు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. మంగళవారం అద్భుతంగా కిరణ దర్శనం జరగడంతో బుధవారం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. దూరప్రాంతాల నుంచి వచ్చి వేకువజామున 4 గంటల నుంచి క్యూలైన్లలో వేచి ఉన్నారు. సూర్యోదయ వేళలో అనుమతివ్వడంతో ప్రత్యేక బారికేడ్ల లైన్లలో వేచి చూస్తూ కొద్ది క్షణాల పాటు కనిపించిన కిరణ దర్శనాన్ని చూసి తరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో వై.భద్రాజీ, సూపరింటెండెంట్ కనకరాజు, సిబ్బంది చర్యలు చేపట్టారు. మళ్లీ మార్చిలోనే కిరణ దర్శనం ఉంటుందని ప్రధానార్చకులు తెలిపారు.



చెప్పేది ఉచితం
చేసేది అనుచితం

ఆమదాలవలస మండలం తొగరాం పంచాయతీ దిబ్బలపేటలో అక్రమంగా వేసిన ఇసుక పోగులివి. బుధవారం కనిపించిన దృశ్యమిది. అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇక్కడేమి లేదని తేల్చేస్తున్నారు. ఉన్నతాధికారులకు అదే సమాచారం ఇస్తున్నారు. కళ్లముందు ఇసుక పోగులు కన్పిస్తున్నా వాటి జోలికి పోవడం లేదు సరికదా ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్నారు. ఇందులో తిలాపాపం తలా పిడికెడు అన్నట్టుగా ముడుపులు తీసుకుని చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు.



ఆమదాలవలస మండలం తొగరాం పంచాయతీ దిబ్బలపేటలో అక్రమంగా తవ్వి తీసుకొచ్చిన ఇసుకను లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న లారీలివి. రాత్రి పొద్దుపోయాక లోడింగ్, రవాణా ప్రారంభమవుతుంది. విశాఖపట్నం నుంచి ఇక్కడికొచ్చి ఇసుకను తరలిస్తున్నాయి. ఒక్కొక్క లారీకి రూ.40వేలు వరకు చెల్లింపులు చేసి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. కళ్లముందు లారీల్లో ఇసుకను రవాణా చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు.

- ‘తమ్ముళ్ల’ ఇసుక దందా
- జిల్లాలోఅందుబాటులో లేని ప్రభుత్వ ఇసుక
- బ్లాక్‌లో లారీ ఇసుక రూ.40వేలకు విక్రయిస్తున్న పరిస్థితి
- టీడీపీ నాయకులకు కాసులు కురిపిస్తున్న ఉచిత ఇసుక విధానం
- అధికారులు సైతం కుమ్మక్కైన వైనం
- జిల్లాలో కుదేలైన భవన నిర్మాణ రంగం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

దిబ్బలపేటలో ఇసుక అక్రమార్కులు బరితెగించేశారు. ఒకరిద్దరు అధికారులు వెళ్లి అభ్యంతరం పెట్టినా వెనక్కి తగ్గడం లేదు. కీలక నేత అండదండలతో ఆ నేత మేనళ్లుల్లు అధికారులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. అధికారులెవ్వరూ రావొద్దు...ఎవరొస్తారో చూస్తాం.. మీరు పట్టించుకోకండి అని ఇటీవల వెళ్లిన ఒకరిద్దరు అధికారులకు స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. ఆ వెంటనే ఆ అధికారులకు కీలక నేత నుంచి ఫోన్ కూడా రావడంతో దిబ్బలపేట జోలికి పోవడం లేదు. పెద్దల అండదండలుండటంతో వారితో విభేదించి ఇబ్బంది పడటం కంటే కలిసిపోయి నాలుగు రూపాయలు వెనకేసుకోవచ్చన్న ధోరణితో సంబంధిత అధికారులు కూడా రాజీ అయిపోయారు.

ఒక్క దిబ్బలపేటే కాదు ఆమదాలవలస నియోజకవర్గంలో కాఖండ్యాం, నారాయణపురం, చినంకాలం, నిమ్మ తొర్లాడ, దూసి, తోటాడ,అక్కివరం, బెలమం, లొద్దలపేట, కొత్తవలస, సింగూరు, శ్రీకాకుళం నియోజకవర్గంలోని బైరి, కరజాడ, బూరవల్లి, కళ్లేపల్లి. కిల్లిపాలెం, పొన్నాం, బట్టేరు, నైరా , గార, నరసన్నపేట నియోజకవర్గంలోని మడపాం, పర్లాం, రామకృష్ణాపురం, శ్రీముఖలింగం, దొంపాక, లుకలాం, బుచ్చిపేట, చేనులవలస, చెవ్వాకులపేట, గోపాలపెంట, ఉర్లాం, పాతపట్నం నియోజకవర్గం పరిధిలోని కొత్తూరు, హిరమండలం తదితర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. సాయంత్రం 6.30గంటలకు ప్రారంభమై రాత్రంతా ఇసుక లారీల జాతర నడుస్తోంది.

డీసిల్టేషన్ పాయింట్‌లోనూ అక్రమాలే..

బూర్జ మండలం కాఖండ్యాంలో నాగావళి నదిలో అధికారికంగా నిర్వహిస్తున్న డీసిల్టేషన్ పాయింట్‌లోనూ అక్రమాలు జరుగుతున్నాయి. అక్కడ అధికారికంగా చలానా తీసుకుంటే సరిపోదు.. కీలక నేతల ముడుపులు అని చెప్పి రూ.12వేల నుంచి 15వేల వరకు వేరేగా ముట్ట చెబితే తప్ప ఇసుక లోడింగ్ జరగదు. విశాఖపట్నం, విజయనగరం నుంచి వచ్చిన లారీల యజమానులు ఎందుకొచ్చిందని అడిగినంత ముట్ట జెప్పి ఇసుకను తీసుకుని వెళ్లిపోతున్నారు. నదిలో వరదలతో ఏర్పడి మేటలను మాన్యువల్‌గా తొలగించి, ఆ ఇసుకను వినియోగదారుల అవసరాలకు విక్రయించాలన్నది డీసిల్టేషన్ ఉద్దేశం. ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా జేసీబీల ద్వారా ఇసుక తవ్వకాలను చేస్తూ నదిలోనే లారీల్లో లోడింగ్ చేసి విక్రయిస్తున్నారు.

దాడులకు తెగబడుతున్న ఇసుక మాఫియా..



బూర్జ మండలం కాఖండ్యాం, చినంకలాం, నారాయణపురం వద్ద జరుగుతున్న ఇసుక అక్రమాలను అడ్డుకుంటున్నారని ససపల సురేష్ అనే వ్యక్తిపై ఇప్పటికే దాడి చేశారు. తీవ్రంగా గాయపరిచి భయానక వాతావరణం సృష్టించారు. రవికుమార్ అనుచరులే దాడి చేశారని బాధితుడు నేరుగా ఫిర్యాదు కూడా చేశారు.

- జలుమూరు మండలం మాకివలసలో ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్న ఉపేంద్ర అనే వ్యక్తి అడ్డుకునే వారిని బెదిరిస్తున్నారు.
- వార్తలు రాసే విలేకర్లను భయపెడుతున్నారు.
- శ్రీకాకుళం నియోజకవర్గంలో ఓ కీలక నేత అనుచరుడు వాసు రెచ్చిపోతున్నాడు. అంతా తానై వ్యవహరిస్తున్నాడు. పోలీసులు పట్టుకున్న లారీలను కూడా పంపించేస్తున్నాడు. ఒక వేళ సీజ్ చేస్తే.. ఆ వాహనాల్లో ఉన్న ఇసుకను రాత్రికి రాత్రి ఖాళీ చేయిస్తున్నాడు.
- పాతపట్నంలో ఏ రకంగానైతే ఇద్దరు నేతల మధ్య ఇసుక వివాదం నడుస్తుందో.. ఇక్కడ ఇసుక దందా కోసం వాసు, ఇతర నేతల మధ్య అంతర్గత పోరు నడుస్తోంది.

టీడీపీ నాయకులకు ఇసుక పండగ

కూటమి ప్రభుత్వం వచ్చేసరికి జిల్లాలో ఐదారుచోట్ల గత ప్రభుత్వంలో సేకరించిన ఇసుక ఉండేది. ఎన్నికల్లో గెలిచిన రోజునే స్టాక్ ఇసుకను వదిలేసి వెళ్లిపోవాలని అప్పటికే సేకరించిన ఏజెన్సీకి హుకుం జారీ చేశారు. దీంతో వారంతా ఉన్న ఫలంగా ఇసుకను వదిలేసి వెళ్లిపోయారు. అలా వదిలేసిన ఇసుక తర్వాత కాలంలో మాయమైంది. కేవలం కొత్తూరు మండలం అంగూరు, టెక్కలిలో మాత్రమే స్టాక్ ఉన్నట్టు చూసి విక్రయ పాయింట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అధికారిక స్టాక్ పాయింట్లు లేకపోవడంతో ప్రైవేటుగా స్టాక్ పాయింట్లు, ర్యాంపులు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు అడ్డగోలుగా అక్రమ ఇసుకను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.

భవన నిర్మాణ రంగం కుదేలు..



వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నంత కాలం ఇసుక విధానం వలన భవన నిర్మాణ రంగం ఇబ్బందులు పడిందని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దగ్గరి నుంచి కింది స్థాయి నాయకుల వరకు హడావుడి చేశారు. తప్పుడు ప్రచారంతో ప్రజల్ని మభ్యపెట్టారు. ఇప్పుడు ఇసుక దోపిడీ తారాస్థాయికి చేరిపోయింది. దీంతో పెద్ద పెద్ద బిల్డర్లు తప్ప ప్రస్తుతం ఇసుకను కొనుగోలు చేసే పరిస్థితి లేదు. 18టన్నుల లారీకి రూ.40వేలు ధర నిర్ణయించడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి ఏర్పడింది విశాఖపట్నంలో ఉన్న బిల్డర్లు తప్ప ఇక్కడెవరు ఇసుకను తీసుకోలేకపోతున్నారు. దీంతో జిల్లాలో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. వాటిపై ఆధారపడి బతుకుతున్న లక్షా 20వేల భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.


పనుల్లేక ఇబ్బందులు



ట్రాక్టర్ ఇసుక 6 వేలకు పైగా ఖరీదు ఉండటంతో కొందరు యజమానులు ఇంటి పనులు ఆపేశారు. దీంతో సరిగ్గా పనులు దొరక్క ఇబ్బందులు పడుతున్నాం.

– వసంతరావు, భవన నిర్మాణ కార్మికుడు, టెక్కలి

నవరాత్రి శోభ



దేవీ నవరాత్రి ఉత్సవాలకు దేవాలయాలు ముస్తాబయ్యాయి. పాతపట్నం నీలమణి దుర్గ, ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి, శ్రీముఖలింగం వారాహి, శ్రీకూర్మంలో వైష్ణవిదుర్గ, శ్రీకాకుళంలో దుర్గాదేవి తదితర ఆలయాలు విద్యుద్దీపాలంకరణలో కనువిందు చేస్తున్నాయి. సామాన్య భక్తులతో పాటు భవానీ భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశమున్నందున కమిటీ సభ్యులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు అమ్మవారు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



విద్యుత్ కాంతులతో అమ్మవారి ఆలయం

కోర్కెలు తీర్చేకల్పవల్లి.. నీలమణి దుర్గ

దేవీ నవరాత్రి ఉత్సవాలకు పాతపట్నంలోని నీలమణి దుర్గ ఆలయం సిద్ధమైంది. విద్యుత్తు కాంతులతో ఆలయాన్ని అలంకరించారు. గురువారం తెల్లవారుజామున నుంచి భక్తులకు అమ్మవారి దర్శనముంటుందని ఆలయ ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. మొదటిరోజు ఉదయం కలశ స్థాపనం, విఘ్నేశ్వరపూజ, దేవ పుణ్యాహవచనం, దీక్షాధారణం, పరిషత్ ప్రాయశ్చిత్తం, అఖండదీప స్థాపన, అంకురారోపణము, అగ్నిప్రతిష్ఠ, అమ్మవారి మూల మంత్రహోమాలతో పాటు యోగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.


–పాతపట్నం



నీలమణిదుర్గ అమ్మవారు



స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం



ప్రధాన దేవాలయం

ఉత్కళాంధ్రుల ఇలవేల్పు.. స్వేచ్ఛావతి



స్వేచ్ఛావతి అమ్మవారు

ఉత్కళాంధ్రుల ఇలవేల్పు, ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి శరన్నవ రాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. భక్తులను కరుణించే చల్లని తల్లిగా, నారాయణ స్వరూపిణిగా, శాంతస్వరూపిణిగా అమ్మవారు పేరుగాంచారు. అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన శ్రీశైలభ్రమరాంబిక ఆలయంలో ఏవిధంగా శరన్నవరాత్రి వేడుకలు నిర్వహిస్తారో ఇక్కడ కూడా అదే రీతిలో నవ రాత్రి పూజలు చేస్తారు. అమ్మవారిని శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ దుర్గ, స్కందమాత, కాత్యాయణి, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిదాయిణి వంటి తొమ్మిది అవతారాల్లో అలంకరిస్తారు.

– ఇచ్ఛాపురం

వరాల తల్లి ‘వారాహి’



వారాహి అమ్మవారు

ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వర ఆలయంలో వారాహి అమ్మవారిని పసుపు కుంకుమ, నూతన వస్త్రాలతో చక్కగా అలంకరించి దసరా శర్నవరాత్రులకు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. వరాలు ఇచ్చే తల్లిగా భావించే అమ్మవారిని దర్శించుకునేందుకు నవ రాత్రి ఉత్సవాల సమయంలో రాష్ట్రం నలుమూలలు నుంచి భక్తులు వస్తారు. పూజల్లో పాల్గొనేందుకు దేవదాయశాఖకు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదు. సాధారణంగా వినియోగించే పూజా సామగ్రినే వాడుతారు.

–జలుమూరు

కూర్మనాథాలయ క్షేత్రపాలిక ‘వైష్ణవి దుర్గ’

శ్రీకూర్మనాథాలయం క్షేత్ర పాలిక వైష్ణవి దుర్గాదేవి. దేవాలయంలో పశ్చిమానున్న ధ్వజస్తంభం సమీపంలో పశ్చిమ, ఉత్తర భాగం మూలన వైష్ణవీ దుర్గ కొలువై ఉంటుంది. శ్రీకూర్మనాథాలయ బ్రహ్మ ప్రతిష్ఠ సమయంలో వైష్ణవీ దుర్గను క్షేత్ర పాలికగా నియమించారని పద్మ, కూర్మ శాస్త్రాలు చెబుతున్నాయి. ఇక్కడికి రాత్రి వేళల్లో దేవతలు దర్శించుకునేందకు వస్తుంటారని, ఆ సమయంలో దుర్గాదేవి బేడా మంటపంపై నాట్యం చేస్తుంటుందని ఆలయ వైదికులు చెబుతుంటారు. కాశ్మీర్ తర్వాత వైష్ణవీ దుర్గాలయం కూర్మనాథాలయంలోనే ఉంది. నవరాత్రులు తొలి రోజు నుంచి ఉదయం వేళల్లో కుంకుమ పూజలు జరుగుతాయని, వీటికి ఎటువంటి రుసుం ఉండదని ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు తెలిపారు.

–గార



శ్రీకూర్మనాథాలయంలో వైష్ణవీదుర్గాదేవి


మాలధారణలకు ప్రత్యేకం.. దుర్గాదేవి

జిల్లా కేంద్రంలోని పాతబ్రిడ్జి వద్ద కనక దుర్గాదేవి ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయ అర్చకులు గంధం దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో భవానీ మాలధారణలు, మండల దీక్షలు, అర్ధమండల దీక్షలు భక్తులు చేపడతారు. జిల్లా నలుమూలల నుంచి ఇక్కడికి పెద్ద ఎత్తున భవానీ భక్తులు వస్తుంటారు.

– శ్రీకాకుళం కల్చరల్



దుర్గాదేవి అమ్మవారు



పాతబ్రిడ్జి వద్ద దుర్గాదేవి ఆలయం

రెచ్చిపోతున్న రౌడీమూకలు



ఈ చిత్రం ఇటీవల సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. విషయం ఏమిటంటే ఓ వ్యక్తి జరుపుకున్న బర్త్‌డే పార్టీలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్న ఫొటో ఇది. ఈ విశేషం పక్కన పెడితే ఇందులో గొండు శంకర్ వెనకున్న వ్యక్తే ప్రస్తుతం చర్చనీయాంశమయ్యారు. శంకర్ వెనకున్న వ్యక్తే తాజాగా ఆనందమయి ఫంక్షన్ హాల్ మేనేజర్‌పై దాడి చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈయన పేరు రాయితి శ్రీను. ఈయనతో పాటు మరికొందరు ఫంక్షన్ హాల్ మేనేజర్‌ను చితకబాదారని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు కూడా నమోదైంది.



- కూటమి ప్రభుత్వంలో నగర ప్రశాంతతకు భంగం
- అధికార దర్పంతో రెచ్చిపోతున్న పచ్చమూకలు
- తాజాగా ఘటనపై ఉద్యమానికి సిద్ధమైన హోటల్ అసోసియేషన్
- ఇప్పటికే ఎమ్మెల్యే గొండు శంకర్‌కు ఫిర్యాదు
- సీఎం, ఎస్పీలకు ఫిర్యాదులు సిద్ధం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం వచ్చాక రౌడీమూకలు రెచ్చిపోతున్నాయి. తప్పతాగి వీరంగం సృష్టిస్తున్నాయి. పేకాట డెన్‌లు, గంజాయి అమ్మకాలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నాయి. తప్పు అని చెప్పేవాళ్లపై దాడులకు తెగబడుతున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఓ పెట్రోల్ బంకు ఎదురుగా గంటల తరబడి కారు అడ్డంగా పెట్టారని అడిగినందుకు కొందరు వ్యక్తులు అక్కడ సిబ్బందిని చితకబాదారు. తాజాగా ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో టీడీపీ నాయకుడు ఫ్యామిలీ ఫంక్షన్ ముగిశాక మద్యం సేవించి వీరంగం సృష్టించారు. మద్యం తాగొద్దు అన్నందుకు ఫంక్షన్ మేనేజర్‌ను తీవ్రంగా కొట్టి గాయపరిచారు. ఇవన్నీ చూస్తే నగరంలో ప్రశాంత వాతావరణంకు భంగం వాటిల్లే పరిస్థితి ప్రమాదం కనిపిస్తోంది.

గొండు శంకర్ హాజరైన బర్త్‌డే పార్టీ ఆ రోజు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున హల్‌చల్ అయింది. ఎమ్మెల్యే పాల్గొన్నదగ్గ కార్యక్రమమేనా అని టీడీపీ సర్కిల్‌లోనూ చర్చ జరిగింది. ఆ ఫొటో రాష్ట్ర స్థాయిలో వైరల్ అయింది. రాష్ట్రంలో మిగతా చోట్ల జరిగిన ఘటనలను పోల్చుతూ సోషల్ మీడియాలో ట్రోల్ అయ్యింది. ఇప్పుడు ఆ పార్టీలో పాల్గొన్న వ్యక్తే తాజాగా ఆనందమయి ఫంక్షన్ హాల్ మేనేజర్‌పై దాడి చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆ ఫొటో మళ్లీ సోషల్ మీడియా లో తెరపైకి వచ్చింది. రకరకాలుగా బేరీజు వేస్తూ...విశ్లేషణ చేస్తూ పోస్టులు నడిచాయి. ఎమ్మెల్యే శంకర్ వారి వెనుక ఉండటం వల్లే రెచ్చిపోతున్నారని విమర్శలు వెల్లువెత్తాయి. ఇదే సమయంలో హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా అదే ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసి, దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నగరంలో భయాందోళన..

ఇటీవల నగరంలోని ఓ పెట్రోల్ బంక్ ఎదుట పార్క్ చేసిన కారును తీయమన్నందుకు ఆ బంకు సిబ్బందిపై కొందరు దాడి చేశారు. దాడుల్లో శివ, కుమార్ అనే ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు 30 మంది వరకు దాడుల్లో పాల్గొనడంతో అక్కడ భయానక వాతావరణం కనిపించింది.

వ్యాపారుల్లో వణుకు..

వరుస ఘటనలతో ప్రజలతో పాటు వ్యాపారులు భయపడుతున్నారు. ఇటీవల జరిగిన రెండు ఘటనల దృష్ట్యా హోటల్ అసోసియేషన్ అప్రమత్తమైంది. మంగళవారం ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఘటనను సీరియస్‌గా తీసుకుంది. బుధవారం సమావేశం నిర్వహించి మేనేజర్‌పై దాడి చేసిన ఘటనను ఖండించింది. అనంతరం ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్పీకి, ముఖ్యమంత్రికి సైతం ఫిర్యాదు చేయనున్నారు. ఈ ఘటనను తేలికగా తీసుకుంటే భవిష్యత్‌లో మరొకరు బరితెగిస్తారని ఆందోళన చెంది ముందుకెళ్లడానికి సిద్ధమయ్యారు.



ఈ ఫొటో చూడండి. తమ తోటి వ్యాపారి, ఫంక్షన్ హాల్ మేనేజర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ.. దాడి చేసిన రాయితి శ్రీను తదితరులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్‌కు హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఫిర్యాదు చేసిన దృశ్యమిది. తక్షణమే చర్యలు తీసుకోవాలని.. ఇలాంటి వారిని ఉపేక్షించొద్దని హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఆనందమయి ఫంక్షన్ హాల్ మేనేజర్ సాధు ధనుంజయరావుపై దాడి ఘటనలో కేసు నమోదు చేసినట్లు శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. ఫంక్షన్ హాలును కొర్ను ప్రతాప్‌కుమార్తె బారసాల కార్యక్రమానికి బుక్ చేసుకున్నారని.. సాయంత్రం నాలుగున్నర ప్రాంతంలో మండపం టైమింగ్ అయిపోవడంతో మేనేజర్ ధనుంజయ తమ సిబ్బందితో క్లీనింగ్ చేయిస్తున్నారని, అదే సమయంలో వధూవరుల గదిలో కొందరు వ్యక్తులు మద్యం సేవించడంతో వద్దని చెప్పడంతో వారంతా చుట్టుముట్టారని పేర్కొన్నారు. అందులో రాయితి శ్రీను అనే వ్యక్తి మేనేజర్ ధనుంజయపై పిడిగుద్దులతో దాడి చేయడంతో చెవికి గాయమైందని ఎస్ఐ తెలిపారు. 323, 324 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో హెచ్‌పీసీఎల్ ఆర్ఎం



అనివెట్టి మండపంలో శ్రీనివాస్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని హెచ్‌పీసీఎల్ సంస్థ రీజనల్ మేనేజర్ పత్తి శ్రీనివాస్ కుటుంబసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మాజీ పాలకమండలి సభ్యుడు డబ్బీరు శ్రీనివాస రావు, సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తాళిబొట్టును తెంచుకుపోయారు



బాధితురాలు సంతోషి

కాశీబుగ్గ : పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కేటీ రోడ్డులో మంగళవారం రాత్రి చోరీ చోటుచేసుకుంది. సీహెచ్ సంతోషి అనే మహిళ రోడ్డు పక్కన నడుచుకుంటూ వస్తుండగా ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తాళిబొట్టును తెంచుకుపోయారు. బాధితురాలు తేరుకునే లోపు పరారయ్యారు. ఈ మేరకు రెండు తులాల బంగారం తాళి చోరీకి గురైందని బాధితురాలు కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

క్షణికావేశంతోనే నేరాలు



కూచిపూడి బృంద సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

గార: క్షణికావేశంతో నేరాలకు పాల్పడుతూ కుటుంబ సభ్యులను క్షోభకు గురిచేస్తున్నారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా అంపోలు జిల్లా జైలులో బుధవారం ఖైదీల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతూ తక్కువ సమయంలో డబ్బులు సంపాదించాలన్న కోరికతో గంజాయి, దొంగతనాల కేసుల్లో ఇరుక్కుంటున్నారని, కష్టపడి పనిచేసిన రూపాయి మాత్రమే మన వద్ద ఉంటుందని గుర్తు పెట్టుకోవాలన్నారు. అనంతరం కూచిపూడి నృత్యం చేసిన సునీత బృందం సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్ వి.సన్యాసిరావు, విష్ణుమూర్తి, లయన్స్ క్లబ్ ప్రతినిధి పి.రవికుమార్, అంధవరపు ప్రసాద్, సూర శ్రీను పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి



నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ : విశాఖపట్నంలో వేలాది మంది కుటుంబాలకు పొట్టనింపుతున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వెంటనే ఆపాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు డిమాండ్ చేశారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం గాంధీ జయంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపి, కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోర కృష్ణారావు, ఉంగ సాయికృష్ణ, పైల వెంకటరావు, బెల్లాల శ్రీనివాసరావు, దున్న సత్యం, గుజ్జు జోగారావు, దువ్వాడ రవి, పోతనపల్లి హరిప్రసాద్, పిచ్చుకల అజయ్, అంబటి ఆనందరావు, సనపల సింహాచలం, బీడి రావు, బమ్మిడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత కృష్ణా జిల్లా



ఫైనల్లో తలపడుతున్న కృష్ణా, తూర్పుగోదావరి క్రీడాకారులు

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి జాతర సందర్భంగా కోటబొమ్మాళిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో కృష్ణా జిల్లా జట్టు విజేతగా నిలిచింది. కోటబొమ్మాళి హైస్కూల్ మైదానంలో సోమవారం నుంచి జరుగుతున్న ఈ పోటీల్లో కృష్ణా, తూర్పుగోదావరి జిల్లా జట్లు ఫైనల్‌కు చేరాయి. హోరాహోరీ పోటీలో కృష్ణా జిల్లా విజేతగా, తూర్పుగోదావరి రన్నరప్‌గా నిలిచాయి. శ్రీకాకుళం(బలగ) మూడో స్థానం, గుంటూరు నాలుగో స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నాయి.

సరదా లేని .. దసరా



కూరగాయలు

- అమాంతంగా పెరిగిపోయిన నిత్యావసరాల ధరలు
- పేద, మధ్య తరగతి ప్రజలపై పెనుభారం
- పండగ వేళ ఇబ్బంది తప్పదంటున్న ప్రజలు

హిరమండలం/శ్రీకాకుళం/ఎచ్చెర్ల: దసరా వేళ సామాన్యుడికి సరదా లేకుండాపోయింది. నిత్యావసరాల ధర లు అమాంతం పెరిగిపోవడంతో కొన బోతే కొరివి అమ్మబోతే అడవి అన్న చందంగా పరిస్థితి మారింది. కూరగాయల ధరలు కూడా దిగిరాకపోవడంతో మూడు పూటల తిండి కూడా ఖరీదైన విషయంగా మారిపోతోంది. ప్రస్తుతం బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుత మార్కెట్‌లో సన్నబి య్యం రూ.72 పైమాటే. సూపర్ మార్కెట్‌లో బి య్యం ధర రూ.100లకు చేరింది. కేంద్ర ప్రభుత్వం వంటనూనెలపై దిగుమతి సుంకం అమాంతం పెంచడంతో నిత్యం వినియోగించే నూనె ప్యాకెట్లపై రూ.15నుంచి రూ.20 అదనంగా పెరిగినట్లు వ్యాపారులు వెల్లడించారు.

పండగ వేళ..

అక్టోబర్ మాసంలో వివాహ ముహూర్తాలు ఉన్నాయి. దీనికి తోడు ఇది దసరా సీజన్ కూడా. ఇలాంటి కీలక సమయంలో ధరలు పెరగడంతో సామాన్యుడి పుట్టి ముంచుతోంది. క్యాటరింగ్ నిర్వాహకులు సైతం భోజనాల ధరలు పెంచేశారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లో క్యాటరింగ్ నిర్వహించే వారు ఇదివరకు పర్ హెడ్ రూ.125నుంచి రూ.130, రూ.140 రకరకాలుగా తీసుకునేవారు. ఇప్పుడు ఏకంగా రూ. 160 వరకు పెంచాశారని చెప్పుకుంటున్నారు. కూరగాయలైతే ఏది కొనాలన్నా కిలో రూ.40 పైమాటే. ఆకుకూరలైతే రూ.20 ఇచ్చినా రెండు కట్టలు కూడా రాని పరిస్థితి.

పెరిగిన ధరలు ఇలా..

బియ్యం క్వింటాల్‌కు	రూ.300 నుంచి రూ.500 వరకు
కందిపప్పు (కిలో)	రూ.150 నుంచి రూ.185
పెసర పప్పు (కిలో)	రూ.135 నుంచి రూ.150
మినప్పప్పు (కిలో)	రూ.120 నుంచి రూ.135
ఉల్లి (కిలో)	రూ 50 నుంచి రూ.65
అల్లం (కిలో)	రూ.100 నుంచి రూ.120
వెల్లుల్లి (కిలో)	రూ.320 నుంచి రూ.360
ఎండుమిర్చి నాటువి (కిలో)	రూ.280 నుంచి రూ.360
అల్లం (కిలో)	రూ.80 నుంచి రూ.120
నూనె (లీటర్)	రూ.110 నుంచి రూ.125

ధరలన్నీ పెరిగాయి



నిత్యావసరాలతో పాటు బియ్యం, కూరగాయల ధరలన్నీ విపరీతంగా పెరిగాయి. మా ఇంట్లో ముగ్గురున్నాం. నెలకు అన్నిఖర్చులతో కలిపి రూ.15వేలు దాటుతోంది. పప్పుదినుసులైతే కొనడం మానేశాం. కందిపప్పు కిలో రూ.170 నుంచి రూ.180 పలుకుతోంది. ఆవాలు, జీలకర్ర, సాస్‌ల ధరలు రెట్టింపయ్యాయి.

– దీర్ఘాసి చిన్నమ్మడు, పాతహిరమండలం

దడ పుడుతోంది



మార్కెట్‌లో ధరలు చూస్తే సామాన్యులకు దడ పుడుతోంది. బియ్యం, కూరగాయలు, నూనె ధరలు పెరిగిపోయాయి. కందిపప్పు ధర కొండెక్కి కూర్చుంది. పండగ పూట పేదింట పప్పులుడకటంలేదు. నిత్యావసరాల ధరలు ఇలా ఉంటే పేద మధ్య తరగతి వారు ఎలా బతకాలి.

– గులువిందల లలిత, తంప హిరమండలం మండలం

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

పాతపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం పాతపట్నం మండలం కొదూరు పంచాయతీ ప్రహరాజపాలెం ఎన్టీఆర్ స్టేడియం ఏదురుగా జగనన్న కాలనీ వద్ద రూ.2.30 కోట్లతో ప్రధాన మంత్రి జన్మాన్ వసతి గృహానికి మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గంలో ఐటీడీఏ, ఐటీఐ ఏర్పాటుకు, పాతపట్నం సీహెచ్‌సీ 100 పడకల ఆస్పత్రి చేయడానికి, ఎత్తిపోతల పథకాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు నీలమణి దుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవింద రావు, కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీవో దొర, డీఈవో తిరుమల చైతన్య, సర్వశిక్షాభియాన్ ఈఈ మూర్తి, మండల ప్రత్యేకాధికారి కరుణాకరరావు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో జయంత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం రూరల్: మండలంలోని లంకాం గ్రామానికి చెందిన కల్లూరి ఆదినారాయణ(74) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఏఎస్‌ఐ నారాయణరావు ఇచ్చిన వివరాల మేరకు.. ఆదినారాయణ కొంతకాలంగా నడుమునొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి తీవ్రమైన నొప్పి రావడంతో భరించలేక వ్యవసాయానికి వాడే పురుగుల మందు తాగి ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కల్లూరి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వాన పడింది.. నీరు నిలిచింది



జలమయమైన మండాపాలం కాలనీ

టెక్కలి: టెక్కలిలో బుధవారం కురిసిన వర్షానికి మేజర్ పంచాయతీ పరిధిలో పలు కాలనీలు జలమయమయ్యాయి. మండాపాలం కాలనీ, భవానీనగర్, ఎన్టీఆర్ కాలనీలో పలు వీధులు వరద నీటితో నిండిపోవడంతో రాకపోకలకు అవస్థలు పడ్డారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఏమైంది?

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సూపర్ సిక్స్‌లో భాగంగా ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఆ దిశగా ఆలోచన చేయకపోగా రాష్ట్ర ప్రజల దృష్టిని మరల్చేందుకే తిరుపతి లడ్డూ వ్యవహారాన్ని తెరపైకి తీసుకొచ్చారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.చందు, బి.హరీష్ ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను ఎంత పక్కదోవ పట్టించినా, ప్రజలను చైతన్యపరిచి ఉక్కు పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలో ఏడురోడ్ల కూడలి వద్ద బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 మంది ప్రాణ బలిదానాలతో, వామపక్ష ఎంపీ ఎమ్మెల్యేల రాజీనామాలతో ఏర్పడిన వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఏ ఒక్కరి సొత్తూ కాదన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే యువత ఉద్యోగాలు లేక రోడ్డున పడతారని చెప్పారు. దీక్షలకు మద్దతుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు నల్లి ధర్మారావు, ఎన్.ఈశ్వరరావు, మల్లేశ్వరరావు, నాగభూషణ రావు సంఘీభావం తెలిపారు. విశాఖ ఉక్కు ప్రాధాన్యత తెలిపే పుస్తకాన్ని ఆవిష్కరించారు. దీక్షలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సీహెచ్ రాజు, జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, మహిళా కన్వీనర్ పవిత్ర, జిల్లా నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విశాఖ ఉక్కు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మహాత్ముని ఆశయానికి 'కూటమి' తూట్లు



నరసన్నపేట: వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

- గాంధీ జయంతి వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మహాత్మా గాంధీ ఆశయాలకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని, ఆయన జయంతి రోజున మద్యం అమ్మకాలకు గేట్లు ఎత్తివేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ దుయ్యబట్టారు. నరసన్నపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ మద్యం ధరలు తగ్గించడం, నిర్వహణ ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడం దారుణమన్నారు. ఇటువంటి నిర్ణయాలు మహాత్మా గాంధీ జయంతి రోజున ప్రకటించడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, సురంగి నర్సింగరావు, పాగోటి రాజారావు, బొబ్బాది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గాంధీ పార్కులో మహాత్ముని విగ్రహానికి నివాళులర్పిస్తున్న కళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు



శ్రీకాకుళం పాతబస్టాండ్: గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిలకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

వంశధార రెండో దశ పూర్తి చేస్తాం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా జీవనాడి వంశధార ప్రాజెక్టు రెండో దశను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పూర్తి చేస్తామని, ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువను ఆధునీకరిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. వంశధార ప్రాజెక్టు రూపశిల్పి దివంగత సీఆర్ఎం పట్నాయక్, మోక్షగుండం విశ్వేశ్వరయ్యల విగ్రహాలను వంశధార సర్కిల్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేరడి బ్యారేజీకి సంబంధించి ఒడిశాతో ఉన్న అడ్డంకులను తొలగించేందుకు అవసరమైతే సీఎం చంద్రబాబు, ఒడిశా ముఖ్యమంత్రి కలిసేలా ఏర్పాటు చేసి రెండు రాష్ట్రాల మధ్య ఇబ్బందులు లేకుండా బ్యారేజీని పూర్తి చేస్తామన్నారు. సీఆర్ఎం పట్నాయక్ లాంటి మహోన్నత వ్యక్తి శ్రీకాకుళంలో జన్మించడం మన అదృష్టమన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ హిరమండలం రిజర్వాయర్ వద్ద రెండెకరాల స్థలంలో సీఆర్ఎం పట్నాయక్ పార్కు ఏర్పాటుచేసి నిలువెత్తు విగ్రహం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నార్త్ కోస్ట్ సీఈ సుగుణాకరరావు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్, ఒడిశా విశ్రాంత చీఫ్ ఇంజినీర్ సి.వి.ప్రసాద్, సీఆర్ఎం పట్నాయక్ కుమారుడు సి.ఈశ్వర్ మోహన్, అల్లుడు కల్నల్ పి.వి.రమణారావు, ఈఈలు, డీఈలు, ఏఈలు, శిష్టకరణ సంఘ నాయకులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సీఆర్ఎం పట్నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే, ఇంజినీర్లు

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఏడుగురు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు జిల్లా నుంచి రికార్డుస్థాయిలో ఏడుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 6 నుంచి 10 వరకు కర్నూలు జిల్లా నంద్యాల వేదికగా జరిగే ఈ పోటీలకు జిల్లా నుంచి బాలురు జట్టుకు మెట్ట అఖిల్, యతిరాజుల లక్ష్మీప్రసాద్, మొదలవలస యశ్వంత్ (కేశవరావుపేట), సింహాద్రి (ఇప్పిలి), బాలికల జట్టుకు లావణ్య, దేవిప్రియ (ఇప్పిలి), అన్నెపు సంధ్య (కేశవరావుపేట) ఎంపికైనట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి, జిల్లా కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు తెలిపారు. ఆగస్టు 17 నుంచి 19 వరకు శ్రీకాకుళంలో జరిగిన 11వ ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం బాలబాలికల జట్లు ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచాయని గుర్తు చేశారు. ఈ టోర్నీలో అద్భుతంగా రాణించిన క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. కాగా నేషనల్ మీట్‌కు ముందు నంద్యాలలో ఈ నెల 3 నుంచి జరగనున్న శిక్షణా శిబిరాలకు హాజరవుతున్న క్రీడాకారులకు సంఘ ప్రతినిధులు బుధవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్ రావు, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సాఫ్ట్‌బాల్ సంఘ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ, ఉపాధ్యాక్షులు మెట్ట తిరుపతిరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవ రావు, జి.మల్లేష్, రామరాజు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో క్రీడాధికారులు, సాఫ్ట్‌బాల్ సంఘ ప్రతినిధులు, పీడీలు

వృద్ధుల హక్కులు పరిరక్షించాలి

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత డీఈవో బి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ వృద్ధుల హక్కులను పరిరక్షించాలని, తల్లిదండ్రుల పట్ల పిల్లలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. జిల్లా వికలాంగ సంక్షేమం, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత మాట్లాడుతూ వృద్ధుల కోసం కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిన రైల్వే టిక్కెట్ల రాయితీలను పునరుద్ధరించాలని కోరారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ వృద్ధుల సమస్యలను సానుకూల ధోరణిలో పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కె.సోమసుందరరావు, కార్యదర్శి పి.నరసింహమూర్తి, కోశాధికారి పి.ఎస్.ప్రసాదరావు, సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీనియర్ సిటిజెన్లు

కలెక్టర్ నిర్ణయంపై ఉత్కంఠ

అరసవల్లి: వైద్యశాఖలో ఉద్యోగం ఆశ చూపి మోసం చేసి..ఆఖరికి బాధితురాలి ఆత్మహత్యకు ప్రేరేపించేలా చేసిన వైద్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగి జి.వి.నరసింహం, అతడికి అండగా ఉన్న కార్యాలయ కీలక అధికారి, వీరిద్దరికీ సహాయ కారిగా మారిన ముఖ్య ఉద్యోగి.. ఈ ముగ్గురి భవితవ్యం కలెక్టర్ తీసుకోనున్న నిర్ణయంపైనే ఆధారపడి ఉన్నాయి. ఇప్పటికే బాధితురాలికి జరిగిన అన్యాయంపై శాఖాపరంగా విచారణ పూర్తవ్వడం.. వాంగ్మూల నివేదికను బాధితురాలికి ప్రతికూలంగా మార్చేసే ప్రయత్నాలు చేయడం సంగతి విదితమే. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై కలెక్టర్ ఆరా తీశారని సమాచారం. మరోవైపు, తమకు న్యాయం జరగకపోతే..కచ్చితంగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయాలని బాధితురాలు, కుటుంబసభ్యులు నిర్ణయానికి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు వారు విజయవాడ క్యాంపు కార్యాలయానికి అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నం మొదలుపెట్టారని తెలుస్తోంది.

డీఎంహెచ్‌వో మార్పు తప్పదా..

జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షిని ఆ స్థానం నుంచి మార్చనున్నారంటూ చర్చ నడుస్తోంది. రాష్ట్రంలో 15 మంది డీఎంహెచ్‌ఓలను మార్చేందుకు రాష్ట్ర వైద్యశాఖాధికారులు సన్నద్ధమవుతున్న తరుణంలో ఆ జాబితాలో ఇప్పటివరకు మన జిల్లా అధికారి పేరు లేకపోయినా.. తాజాగా పరిస్థితులను బట్టి ఆమె పేరును చేర్చినట్లుగా విశ్వసనీయ సమాచారం. వరుసగా వస్తున్న ఆరోపణలు, శాఖాపరంగా వస్తున్న సమస్యల దృష్ట్యా ఈమె స్థానం మార్పు ఖాయమనే సంకేతాలు వినిపిస్తున్నాయి.

ఉత్సవం.. ఉత్సాహం..



వెయిట్‌లిఫ్టింగ్ పోటీల విజేత ఆవల గోవిందరావు



ప్రత్యేక ఆకర్షణగా జెయింట్ వీల్



కొత్తమ్మతల్లిని దర్శించుకున్న జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా దంపతులు



విద్యుద్దీపాలంకరణలో ఆలయ వీధులు

కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరకు రెండో రోజైన బుధవారం లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఉలవల బస్తాలు, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి. ఉలవల బస్తాలు, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నిమ్మాడకు చెందిన ఆవల గోవిందరావు, నరసన్నపేటకు చెందిన పి.నాగరాజు, ఒప్పంగికి చెందిన గేదెల సత్యనారాయణ బహుమతులు గెలుచుకున్నారు. – కోటబొమ్మాళి